

పథకాల అమలు నిరంతర ప్రక్రియ

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ మండలం గొట్టిముక్ల గ్రామంలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 26వ తేదీ నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల గురించి గ్రామస్థులకు వివరించారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా అందుతుందన్నారు. సాగుభూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సాలీనా రూ.12 వేలు అందుతాయన్నారు. ఈమేరకు అర్హుల వివరాలను గ్రామ సభలో చదివి వినిపించారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుండా గ్రామసభ వీటికి ఆమోదం తెలిపిందన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుంచి కూడా అర్జీలు స్వీకరిస్తామన్నారు. గ్రామ సభల్లో దరఖాస్తులు చేయలేనివారు మండల కార్యాలయాల్లోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జాత చేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. గ్రామ సలో మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పంచాయతీ సెక్రటరీ మధుకర్ రెడ్డి, స్థానిక అధికారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం అన్ని శాఖల అధికారులతో ఈ మేరకు ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలన్నారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మ్యూచువల్, స్పౌజ్ బదిలీలకు గ్రీన్ సిగ్నల్



వికారాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మ్యూచువల్, స్పౌజ్ బదిలీలకు విద్యా శాఖ ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మ్యూచువల్ బదిలీల కోసం జిల్లా నుంచి 85 మంది ఉపాధ్యాయులు, స్పౌజ్ బదిలీల కోసం 31 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కాగా, వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు మ్యూచువల్ బదిలీల కోసం 66 మంది, స్పౌజ్ బదిలీల కోసం 31 మంది దరఖాస్తులు అర్హత కలిగినట్లు గుర్తించారు. కాగా, మ్యూచువల్ బదిలీలకు 66 మంది, స్పౌజ్ బదిలీలకు 28 మంది ఉపాధ్యాయులు తమ అంగీకారం తెలియజేశారు. మ్యూచువల్, స్పౌజ్ విభాగాల్లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు సర్వీస్ రికార్డులను మంగళవారం పరిశీలించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు డీఈవో రేణుకాదేవి ఇద్దరు జీహెచ్‌ఎంల ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేశారు. అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత మ్యూచువల్, స్పౌజ్ బదిలీలకు అర్హత కలిగిన జిల్లాలోని ఉపాధ్యాయుల జాబితాను మంగళవారం రాత్రి విద్యా శాఖ ఉన్నతాధికారులకు పంపించారు. కాగా, మ్యూచువల్ విభాగంలో ఇతర జిల్లాల నుంచి 66 మంది ఉపాధ్యాయులు, స్పౌజ్ విభాగంలో ఒకరు జిల్లాకు రానున్నట్లు తెలిసింది.



తాండూరు మండలం మాల్కాపూర్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

తొలిరోజు ప్రశాంతం

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ కోసం అర్హులను ఎంపిక చేసేందుకు నిర్వహించిన గ్రామ, వార్డు సభలు తొలిరోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 568 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీల్లో 97 వార్డులు ఉన్నాయి. కాగా, తొలిరోజు 181 పంచాయతీల్లో గ్రామ సభలు, 23 వార్డు సభలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా జరిగిన గ్రామ, వార్డు సభలు ప్రశాంతంగానే జరిగినా.. చౌడాపూర్ మండలం, కొత్తపల్లిలో మాత్రం ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు అర్హులకు రాలేవని ప్రజలు మండిపడగా, కాంగ్రెస్ నాయకులకు, వారి వర్గీయులకు ఇచ్చారంటూ బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు.

- హాజరైన జిల్లా, మండల అధికారులు
- చౌడాపూర్, కొత్తపల్లిలో అధికారులను నిలదీసిన ప్రజలు
- అవకతవకలంటూ ధ్వజమెత్తిన బీఆర్‌ఎస్ నాయకులు
- భారీగా వచ్చిన నూతన దరఖాస్తులు

181 గ్రామాలు, 23 వార్డుల్లో సభలు

వికారాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి అమలు చేయతలపెట్టిన ఈ నాలుగు పథకాలకు లబ్ధిదారులను గుర్తించేందుకు 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో అధికారుల బృందాలు సర్వే నిర్వహించాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వేలో అర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల జాబితాలపై చర్చించి అర్హులను ఎంపిక చేసేందుకు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నారు. తొలిరోజు మంగళవారం నిర్వహించిన సభల్లో ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు. అనంతరం ప్రజల సమక్షంలో ఆమోదం తీసుకొని ఫైనల్ జాబితాను సిద్ధం చేశారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లబ్ధిదారుల జాబితాపై ప్రజల నుంచి అక్కడక్కడ నిరసనలు వ్యక్తమైనా.. ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన నాలుగు పథకాలు అర్హులు ఎవరికైనా వర్తించకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. అర్హులైన వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో గ్రామ, వార్డు సభలు తొలిరోజు మంగళవారం ప్రశాంతంగానే కొనసాగాయి.

జిల్లాలో నిర్వహించిన గ్రామ, వార్డు సభలకు కొన్ని చోట్ల జిల్లా కలెక్టర్,

మిగతా 8వ పేజీలో...



జైలు నుంచి లగచర్ల బాధితుల విడుదల

దుద్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగచర్ల ఘటనలో అరెస్టయి సంగారెడ్డి జైలులో ఉన్న మదరయ్య, గోపాల్‌నాయక్, రమేశ్, మంగ్యానాయక్ మంగళవారం రాత్రి విడుదలయ్యారు. కాగా, సంగారెడ్డి జైలులో ఉన్న మరో నిందితుడు లోక్యానాయక్‌కు కూడా బెయిల్ మంజూరైంది. కానీ సరైన సమయంలో పత్రాలు అందజేయకపోవడంతో మంగళవారం విడుదల కాలేదు. బుధవారం విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. లగచర్ల ఘటనలో అధికారులపై జరిగిన దాడిలో ఏ2 నిందితుడిగా ఉన్న సురేశ్‌రాజ్ మాత్రం చంచల్‌గూడ జైలులో ఉన్నాడు.

ట్రాఫిక్ నియమాలు విధిగా పాటించాలి

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణ రెడ్డి

వికారాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని కొండా బాలకృష్ణరెడ్డి గార్డెన్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జాతీయ రోడ్డు భద్రత ఉత్సవాలకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీవో వెంకట్‌రెడ్డి, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఎంవీఐ జోసెఫ్, వికారాబాద్ సీఐ భీమ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు, వారి ఆస్తులకు అండగా ఉంటా

» పోలీసులు, రెవెన్యూ అధికారులు విఫలం
» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పేదలకు, వారి ఆస్తులకు తాను అండగా ఉంటానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఏకశీలనగర్ ప్లాట్స్ ఓనర్స్‌కు భరోసానిచ్చారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల ఏకశీల నగర్‌లో మంగళవారం నిర్వహించిన ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 739 నుంచి 749ల్లోని 149 ఎకరాల భూమిలో ఏకాశీలనగర్ పేరుతో 2,076 ప్లాట్లు చేశారని తెలిపారు. అందులో పేదలు, ప్రభుత్వ చిన్న ఉద్యోగులు కొనుగోలు చేశారని తెలిపారు. 2006లో ఓ రియల్ వ్యాపారి దొంగ డాక్యుమెట్లు సృష్టించి కన్వర్షన్ చేయించుకున్నాడన్నారు. ప్లాట్ల యజమానులు కోర్టుకు వెళ్లితే ప్లాట్ల ఓనర్స్‌కే అనూకులంగా తీర్పు వచ్చిందన్నారు. కాగా, నాటి డీటీవో మేనేజ్ లేఅవుట్‌ను రద్దు చేయించారు. తర్వాత పట్టదారు పాసుపుస్తకాలు పొంది ప్లాట్ల ఓనర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకశీలనగర్ వెంచర్‌లో కబ్జాలకు పాల్పడుతున్న విషయమై పలుమార్లు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సామాన్యులకు భద్రత కల్పించకపోతే పోలీసులపై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఏకశీలనగర్ ఓనర్స్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ వెంచర్‌లో ప్లాట్ల ఓనర్స్‌కు, బిల్డర్ వెంకటేశ్‌కు సంబంధించి కోర్టులో వివాదం నడుస్తున్న విషయాన్ని ఎంపీ ఈటలకు స్థానిక నాయకులు చెప్పలేదని తెలిసింది. ప్రైవేటు భూమిలో నిర్వహించిన సమావేశానికి వెళ్లడం సరికాదని అ పార్టీ నేతలే గుసగులాడుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్
» ఉప్పరిపల్లి వార్డు సభకు హాజరు



ఉప్పరిపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పరిపల్లి వార్డు, బొమ్మరాసిపేట గ్రామాల్లో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల లబ్ధిదారుల పేర్లను వార్డు, గ్రామ సభల ప్రదర్శనలో సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారని చెప్పారు. అర్హుల జాబితాలో అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్థానిక ప్రజలకు సూచించారు. పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికే కాకుండా, ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు రైతు భరోసా కింద ఎకరానికి రూ. 12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందుతుందన్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామన్నారు. గ్రామ సభల్లో పథకాల కోసం దరఖాస్తు చేసుకోలేనివారు ఈనెల 26 తరువాత ఎప్పుడైన మండల కార్యాలయాలలోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ గ్రామ, వార్డు సభల్లో శామీర్‌పేట మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, ఎంపీడీఓ మమతాబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న అనురాధ మెడోస్

కేంద్ర ఆరోగ్య పథకాల అమలుపై ఆరా

వికారాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య పథకాలను పర్యవేక్షించేందుకు సంక్షేమ శాఖ సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మెడోస్ మంగళవారం జిల్లాలో పర్యటించారు. మూడు రోజుల పర్యాటనలో భాగంగా మొదటి రోజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం, మాతా శిశు సంరక్షణ సేవలు, కుటుంబ నియంత్రణ, జాతీయ కుష్టు నివారణ కార్యక్రమం అమలు, నిధుల విడుదల, ఖర్చుల నిర్వహణ, వాటి ఫలితాలపై సమీక్ష జరిపారు. అనంతరం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో వెంకటరవణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీంద్రయాదవ్, డాక్టర్ జీవరాజు, డాక్టర్ పవిత్ర పాల్గొన్నారు.

మేడ్చల్‌లో 19 గ్రామాల్లో సభలు

» సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శన
» అభ్యంతరాలను స్వీకరించిన అధికారులు

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ తదితర పథకాలను ఈ నెల 26 నుంచి అమలు చేసే లక్ష్యంతో జిల్లాలో మంగళవారం అధికారులు గ్రామ, వార్డు సభలను నిర్వహించారు. ఈ సభల్లో ఆయా పథకాల లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించారు. ఈ నెల 24 వరకు ఈ సభలు కొనసాగనున్నాయి. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా జిల్లాలో మొత్తం 62 గ్రామ పంచాయతీలుండగా తొలిరోజు 19 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లోని వివిధ వార్డుల్లో కూడా వార్డు సభలు నిర్వహించారు. కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పలు చోట్ల ఆయా సభల్లో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవో, ఎంఏఓలు మున్సిపాలిటీల్లో కమిషనర్లు, ఏఈలు గ్రామ సభలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి గుర్తించిన లబ్ధిదారుల జాబితాను అధికారులు గ్రామ సభల్లో చదివి వినిపించారు. గ్రామ సభల్లో ప్రజలు ఆమోదించిన తర్వాత జాబితాలను కలెక్టర్‌కు నివేదించారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో మొదటి రోజు గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

రాంపల్లి దాయర గ్రామ సభలో..

కీసర: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆహార భద్రత కార్డులు అందజేస్తామని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి దాయర, భోగారం, నర్సంపల్లిలో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా రాంపల్లి దాయరలగ్రామసభలో ఆయన పాల్గొన్నారు. కాగా, రాంపల్లి దాయరకు చెందిన కందాడి సుశీల కుటుంబ సభ్యుల పేరుపై ఉన్న రైతు భరోసా, రేషన్ కార్డులను స్వచ్ఛందంగా వదులుకుంటున్నట్లు గ్రామసభలో సుశీల అదనపు కలెక్టర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవీ పీడీ సాంబశివరావు, ఎంపీడీవో గ్యామా, తహసీల్దార్ అశోక్, మండల వ్యవసాయ శాఖ అధికారి మాదవీలత, ఎంపీవో నందకిషోర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



అలియాబాద్‌లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

అధికారులను నిలదీసిన ప్రజలు

శామీర్‌పేట/మూడుచింతలపలి: అర్హులకు ఇళ్లు, రేషన్‌కార్డులను ఇవ్వడం లేదని మండలంలోని అలియాబాద్‌లో నిర్వహించిన గ్రామ సభలో పజలు అధికారులను, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిలదీశారు. అధికారులు సమాధానం చెబుతున్నప్పటికీ మాటిమాటికి సభలో అడుగుతూ అధికారులపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మమతాబాయి, ఎంపీఓ వినూత్న, ఏఈఓ రవికుమార్, ఆర్ఐ కవిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్, అనంతారం, అద్రాస్‌పల్లి, జగ్గంగూడ గ్రామాల్లో గ్రామ సభల్లోనూ అర్హులకు పథకాలు అందడం లేదని స్థానికులు అధికారులను నిలదీశారు. లబ్ధిదారుల ఎంపికలో అవతవకలు జరిగాయని అధికారులతో పాటు నాయకులను నిలదీశారు. మేడ్చల్ ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్ కలగజేసుకొని అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు. కార్యక్రమంలో ఎంపీవో మంగతయారు, ఏఈవో లక్ష్మణ్, ఆర్ఐ సరస్వతి, పంచాయితీ కార్యదర్శి ఉషా, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

తాండూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తాండూరులో మంగళవారం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం ఏర్పాటు చేసి సీఐటీయూ అనుబంధంగా కొనసాగుతామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కె.రాములు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలో నలుగురే విద్యార్థులు!



కాశింపూర్‌తండాలో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

బషీరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశింపూర్ తండా ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు కేవలం నాలుగురే విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు వస్తున్నారు. ఇక్కడ ఏడుగురు విద్యార్థులు ఉన్నప్పటికీ ఒకటో తరగతిలో ఇద్దరు, రెండోతరగతిలో ఒకరూ, మూడోతరగతిలో ఇద్దరు, నాలుగోతరగతిలో నిల్, ఐదోతరగతిలో ఇద్దరు చదువుకుంటున్నారు. వీరిలో ముగ్గురు రెగ్యులర్‌గా పాఠశాలకు రావడంలేదని ఉపాధ్యాయుడు చెప్పుకొచ్చారు. ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు ఎంత చెప్పినా పాఠశాలకు పంపించడం లేదని ఉపాధ్యాయుడు వాపోయాడు. చేసేదేమి లేక ఉపాధ్యాయుడు కార్తిక్ పాఠశాలలోఆ నాలుగురికి ట్యాబ్‌లో డిజిటల్ పాఠాలు వినిపిస్తూ కనిపించగా 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ఈ దృశ్యం క్లిక్ మనిపించింది.

మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్ల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకుడు ఉన్నికృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. మంత్రి సీతక్క ఆశా వర్కర్ల హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి, వాసంతి, కోమలత, రాజ్యలక్ష్మి, హేమలత, శోభ, రాధ, రేణుక, పల్లవి, మంజుల, విజయ, పుష్ప, పద్మ, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

మొయినాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఘణపురం సురధీర్ తెలిపారు. మంగళవారం మొయినాబాద్ మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీలను అందించారు. అయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తుకారామ్, ప్రధాన కార్యదర్శి వినోద్‌యాదవ్, మండల గౌరవాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చౌదరిగూడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం, శారీరక ధారుడ్యం పెరుగుతుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కొందుర్గు మండల పరిధిలోని ఆగిర్యాలలో ఏపీఎల్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, గోపాల్, బీమయ్య, శేఖర్, బల్వంత్‌రెడ్డి, రాంచంద్రయ్యలతోపాటు, ఆర్గనైజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు

తలకొండపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా తోడ్పాటునందిస్తుందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఒత్తిళ్లను అధిగమించి ఆనందమయ జీవితాన్ని పొందుతారని అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల నాయకులు మంగళవారం రాఘవేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఫిబ్రవరి 7నుంచి 9వరకు గ్రామంలోని శ్రీ వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించి రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. వెల్జాల వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ పరంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, మార్కెట్ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి, నాయకులు అజీజ్, ఆరిఫ్, అశోక్‌బాబు, నర్సింహులు తదితరులు ఉన్నారు.

నృత్య ప్రదర్శనలో చిన్నారి ధన్విశ్రీ ప్రతిభ



తాండూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నివసిస్తున్న సరిత గోపాల్ దంపతుల కూతురైన ధన్విశ్రీ శ్రీశైల దేవస్థానంలో నిర్వహింపబడిన సాంస్కృతిక కార్యక్రమంలో అత్యుతమైన ప్రదర్శన కనబరిచింది. ధన్విశ్రీ పట్టణంలోని శ్రీ నేతాజీ పాఠశాలలో 1వ తరగతి చదువుతోంది. ఒకటవ తరగతిలోనే ఇంతటి ప్రతిభను కనబర్చడంతో పాటు తాండూరు పట్టణ వాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు ఆమె చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ టీచర్ మంజుల, సన్నిహితులు సంధ్య శివకుమార్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

ఆమనగల్లు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పోల్కంపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్లు చెన్నకిషన్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి, ఎనుగొండ రాంరెడ్డి, లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్ రెడ్డి లతో కలిసి వంశీకృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు 690 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, హైదరాబాద్ స్టార్స్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రీజియన్ చైర్మన్ శ్రీను, జోన్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, జిల్లా చైర్మన్‌లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి సంక్షేమ పథకాలు అమలు



గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్/ధారూరు/జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి 26వ తేదీ నుంచి సంక్షేమ పథకాలు అందుతాయని ఇది నిరంతర ప్రక్రియ అని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నెపల్లి 32వ వార్డు, ధారూరు మండల పరిధిలోని దోర్నాల్ గ్రామం, మోమిన్‌పేట్ మండల పరిధిలోని మేకవనంపల్లి గ్రామంలో నిర్వహించిన సభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన అర్హుల ఎంపిక జాబితాలను ఈ సభల్లో ప్రదర్శించామన్నారు. అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అర్హత కలిగి జాబితాలో పేర్లు లేని వారి నుంచి గ్రామ సభలలో అర్జీలు స్వీకరిస్తున్నామని ఆయన చెప్పారు. వికారాబాద్ మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల్‌రమేశ్, కమిషనర్ జాకీర్ అహ్మద్, దోర్నల్ కార్యక్రమంలో ఎంపీడీవో నర్సింహులు, మేకవనంపల్లిలో నిర్వహించిన సభలో మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సదానందం, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఏఈ ప్రణీత్, వ్యవసాయ అధికారి జయశంకర్, వైద్యురాలు గీత, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కుమార్‌తో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ భూ రిజిస్ట్రేషన్‌పై విచారణ



మోమిన్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న ట్రైనీ కలెక్టర్

వికారాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అతమ భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని మోమిన్‌పేట్ మండలం ఇజ్రాచిట్టెంపల్లికి చెందిన ఓ రైతు కుమారుడు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మండల కేంద్రంలో గల సర్వే నెం.661లో ఎకరా 10 గుంటల భూమిని జనవరి 16న ఇతరులు తమకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని సీత్యానాయక్ కుమారుడు ధన్నునాయక్ విలపించడంతో కలెక్టర్ ప్రతీక్‌జైన్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి విచారణతో రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఆర్ఐ గోవర్ధన్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. మోమిన్‌పేట్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆమె పాల్గొని ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు చేశారు. శిక్షణ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు సమ్మయ్య, గౌరీ శంకర్, శిక్షకులు రమేశ్, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధి రాజు, సీఆర్‌పీ శ్రీనివాస్, బుచ్చయ్య, ఆపరేటర్ పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవితఖైదు

శంకర్‌పల్లి, జనవరి21(ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పీడీజే కోర్టు న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి తీర్పు వెలువరించారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మీర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్ ఫేజ్-2లో నివసించే జల్‌పేట మాణిక్యం తన భార్య యాదమ్మ ఇతరులతో వివాహేతర సంబంధం పెట్టుకుందని 2024 మే 5న అర్ధరాత్రి యాదమ్మ(48) నిద్రించే సమయంలో రాయితో తలపై కొట్టి హత్య చేశాడు. మోకిల పోలీసులు 2024 మే 6న మాణిక్యంపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి మంగళవారం నిందితుడు మాణిక్యంకు జీవితఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ తెలిపారు.

ఆర్యవైశ్యులకు అండగా ప్రభుత్వం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం, యువజన సంఘాల కార్యవర్గం సోమవారం రాత్రి స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మలిపెద్ది శ్రీనివాస్‌గుప్త, ప్రధాన కార్యదర్శిగా గందె శంకర్, కోశాధికారిగా పోల శశిధర్, మహిళా సంఘం అధ్యక్షురాలిగా గబ్బుల శ్రీలత, ప్రధాన కార్యదర్శిగా మలిపెద్ది శ్రీదేవి, కోశాధికారిగా ఆగీరు ఉమ, యువజన సంఘం అధ్యక్షుడిగా దండు నవీన్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది విజయ్‌మోహన్, కోశాధికారిగా గజ్జల ప్రవీణ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేసిన వారిని సన్మానించి, అభినందించారు. ప్రజా శ్రేయస్సు కోసం చేసే సమాజిక కార్యక్రమాలలో కూడా భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు నాగిళ్ళ గోపాల్‌గుప్త, గందె సురేష్, మలిపెద్ది శంకర్, బెజ్జుగం రమేష్, పలబట్ల బాల్‌రాజ్‌గుప్త, పలబట్ల జగన్‌మోహన్‌రావు, కలకొండ కృష్ణయ్య, సారాపు రమేష్, విజయ్, పెద్ది రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో వెల్జాలను ఆదర్శంగా నిలుపుతా



వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వెల్జాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శంగా నిలుపుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు పీఏసీఎస్ ల విస్తరణలో భాగంగా వెల్జాలలో కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, అజీం, శ్యామ్‌సుందర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్ రెడ్డి, కార్యదర్శి రవీందర్ యాదవ్, ఎంపీడీవో శ్రీకాంత్, తహసీల్దార్ నాగార్జున నాయకులు పాల్గొన్నారు.

బోసిపోయిన ప్రభుత్వ కార్యాలయాలు

బషీరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ కార్యాలయాలు మంగళవారం బోసిపోయి కనిపించాయి. మండల స్థాయి అధికారులు తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, వ్యవసాయాధికారి అనిత, సూపరింటెండెంట్ విజయకుమారి సిబ్బంది పలువురు ప్రజాపాలన గ్రామ సభల్లో పాల్గొన్నారు. ఆయా కార్యాలయాల వద్ద వివిధ పనుల కోసం వచ్చే జనాలతో సందడిగా ఉండేది. అధికారులందరూ గ్రామసభలకు వెళ్లడంతో కింది స్థాయి సిబ్బంది ఒకరిద్దరూ మాత్రమే కార్యాలయాల్లో కనిపించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చిన జనం విషయం తెలుసుకుని వెనుదిరిగి వెళ్లారు. దీంతో కార్యాలయ పరిసరాలు రోజంతా జనం లేకుండా నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

పులుమద్దిలో మద్యం విక్రయించొద్దు

గ్రామస్తుల వినూత్న ప్రచారం



పులుమద్దిలో ప్రచారం చేస్తున్న గ్రామస్తుడు

వికారాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో, జిల్లాలో మద్యం ఏరులై పారుతే, ఊరు వాడ ఎక్కడ పడితే అక్కడ మద్యం విక్రయాలు జరుగుతుంటే ఆ గ్రామ ప్రజలు మాత్రం మద్యం అమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. వికారాబాద్ మండలం పులుమద్దిలో మద్యం అమ్మకాలు చేయవద్దని ప్రచారం చేయించారు. పది సంవత్సరాలుగా ఈ గ్రామంలో బెల్టుషాపులను నిషేధించారు. గ్రామపెద్దలు, తాజా మాజీ సర్పంచ్ మాధవరెడ్డి సహకారంతో గ్రామస్తులు అందరితో చర్చించి గ్రామంలో బెల్టుషాపులు నిషేధించారు. ఇప్పటి వరకు ఆ పరంపర కొనసాగుతుంది. తాజాగా మరోసారి గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించకూడదని గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే రూ.25వేల జరిమానా ఉంటుందని డబ్బు చాటింపు వేయించారు. ఇదిలా ఉంటే ఎన్నికల సమయంలో గ్రామాల్లో బెల్టుషాపులు లేకుండా చేస్తామని నాయకుల హామీని నెరవేర్చి గ్రామాల్లో మద్యం అమ్మకాలు జరపకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణ కార్యక్రమంలో నాయకులు

కొత్తూర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలో గల శ్రీ సీతారామచంద్ర పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం మండల పూజలో భాగంగా సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయం 41 రోజులు పూర్తి చేసుకోవడంతో గ్రామ ప్రజలు మండల పూజ నిర్వహించారు. ప్రతిష్ఠ వైదిక పురోహితులు, చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో పురోహితులు సీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే గణపతిపూజ, మూలమంత్ర హోమాలు, పూర్ణకుంభాబిషేకాలు, మహాస్నపనం, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వేలాది మంది పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ బార్ అసోసియేషన్ మాజీ చైర్మన్ బి. జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిర్ర మల్లయ్య, మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచులు జయప్రద జగన్‌మోహన్‌రెడ్డి, రమాదేవిరమేష్, మెండె నర్సింహ, అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, కొత్తూర్ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణయాదవ్, కాంగ్రెస్ నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డి, రవినాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి ఎమ్మెల్యే కారుకు ప్రమాదం



స్వల్పంగా దెబ్బతిన్న కారు, బైక్

పరిగి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి వాహనానికి చిన్నప్రమాదం జరిగింది. ఎమ్మెల్యే పరిగి మండలం గడిసింగాపూర్ గ్రామంలో గ్రామ సభ ముగించుకుని మెయిన్ రోడ్డుపైకి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పరిగి మండలం రూప్‌సింగ్‌తండాకు చెందిన నేనావత్ మిట్టు అనే వ్యక్తి పరిగి నుంచి బైక్‌పై వస్తున్నాడు. గడిసింగాపూర్ స్టేజి దగ్గర గ్రామంలో నుంచి ముందు పోలీస్ వాహనం వెనుకాల నుంచి ఎమ్మెల్యే వాహనం రోడ్డు పైకి వస్తున్న క్రమంలో బైక్‌పై ఉన్న మిట్టు పోలీస్ వాహనాన్ని చూసి కంగారు పడి ఎమ్మెల్యే వాహనానికి ముందు భాగాన తగిలించాడు. బైక్‌తోపాటు, కారు కూడా స్వల్పంగా దెబ్బతింది. బైక్‌పై నుంచి కింద పడిన వ్యక్తిని, వాహనంలో ఉన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్వయంగా కిందకు దిగి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి ఇంటికి పంపించారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే రత్నం తదితరులు

చేవెళ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేసారం గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ బోనాలు కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉత్సవాలు నిర్వహించగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మతల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలతో ఊరేగింపు కొనసాగించారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కేసారం మాజీ సర్పంచ్ రమేశ్ గౌడ్, నాయకులు హన్మంత్‌రెడ్డి, రఘువరన్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమ్మరి రఘు, మహేందర్, రాజుగౌడ్, నాగరాజుగౌడ్, సుధాకర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు



ప్రశాంత్ రెడ్డి

వికారాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్ల ఆయుధాలని వికారాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ప్రశాంత్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని రకరకాల మాయమాటలతో ఆఫర్లుపెట్టి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దన్నారు. ప్రజల నుంచి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి వారితో మరికొంత మందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ, ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త కొత్త టెక్నిక్‌లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారన్నారు. ఇలాంటి నూతన స్కీంల పట్ల నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. మోసపోయిన పక్షంలో ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా 1930 ట్రోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి గానీ, పోలీస్ స్టేషన్‌లో గాని ఫిర్యాదు చేయాలన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడిపై ఆరోపణలు సరికాదు

వికారాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కాంట్రాక్టర్ చిట్టెపు మల్లారెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని మాజీ సర్పంచ్ దేవయ్య, ఉపసర్పంచ్ కృష్ణ అన్నారు. నవాబుపేట మండలంలోని ఎక్‌మామిడి గ్రామంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. దళిత వాడల్లో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించినా కొందరు నిర్మించలేదంటూ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. కాంట్రాక్టర్ మల్లారెడ్డి గత 20సంవత్సరాలుగా దళిత వాడల అభివృద్ధి కోసం రూ.కోటికి పైగా నిధులు ఖర్చు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి నర్సింహులు, మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ నేతృత్వంలో వికారాబాద్‌కు రూ.60కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి చేసినట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలోనే వికారాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పాటైనట్లు గుర్తుచేశారు. అదే విధంగా వికారాబాద్ రైల్వే బ్రిడ్జి పనులకు రూ.90కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ గోపాల్, నాయకులు మేక చంద్రశేఖర్ రెడ్డి, మంచన్‌పల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే గ్రంథాలయాల అభివృద్ధి

షాద్‌నగర్ అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు బీఆర్ఎస్(కేసీఆర్) హయాంలోనే అభివృద్ధి చెందాయని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. షాద్‌నగర్ బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రంథాలయాలను పట్టించుకోలేదని అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సహకారంతో రూ.4కోట్ల వ్యయంతో షాద్‌నగర్ గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించామన్నారు. కొందుర్గులో 671 చదరపు గజాల స్థలాన్ని సేకరించామని తెలిపారు. రూ.10లక్షలతో కేశంపేట గ్రంథాలయ భవన మరమ్మతులు చేశామని చెప్పారు. ఆయనతో పాటు మహేశ్వర్, సుధాకర్, జంగరాజ్, శేఖర్, సలీం, జగన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం

- గ్రామ, వార్డు సభల్లో ఎమ్మెల్యేలు, అధికారులు
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల పేర్లు ప్రకటన
- జాబితాలో పేరు లేదని పలువురి వాగ్వాదం


పెద్దేముల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


పరిగి: గడిసింగాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


బషీరాబాద్: దామర్‌చెడ్ గ్రామ సభలో మట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి

పెద్దేముల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేద లందరికీ ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అందేలా చూస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని గాజీపూర్, గోపాల్‌పూర్, నాగులపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. ఈనెల 26నుంచి ఇందిరమ్మఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే మంజూరైన వారి పేర్లు గ్రామసభల్లో చదివి వినిపించారు. పేర్లు రానివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.22వేల కోట్లు రుణమాఫీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు అంజయ్య, మండల అధ్యక్షుడు గోపాల్, నారాయణరెడ్డి, నర్సింహులు, ప్రవీణ్‌కుమార్, మల్లేశం, రియాజ్, మధుసూదన్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

పరిగి/పూడూరు/దోమ: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తుందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి మండలం గడిసింగాపూర్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందుకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వాసుచంద్ర, హౌజింగ్ బోర్డు డైరెక్టర్ కృష్ణ, పరిగి ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, అయూబ్, ఎం.లాల్‌కృష్ణప్రసాద్, నర్సింహారావు, సత్యనారాయణ పాల్గొన్నారు. అదేవిధంగా మునిసిపల్ పరిధిలోని రెండవవార్డులో మంగళవారం జరిగిన గ్రామసభలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, డీసీసీ ప్రధానకార్యదర్శి ఎన్.రామకృష్ణలు వివిధ పథకాల కింద లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు బి.అర్చన, వారాల రవీంద్ర, నాయకులు బి.మైపాల్, రాంరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా పూడూరు మండలంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండల కేంద్రంలో రూ.3కోట్ల 20లక్షలతో కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని చేపట్టడానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్ పాల్గొన్నారు. దోమ మండలంలోని శివారెడ్డిపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు.మండలంలోని దాదాపూర్, దిర్సంపల్లి, అయినాపూర్, దిర్సంపల్లి తండా, బాసుపల్లి, గుండాల్, కొత్తపల్లి, బొంపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేష్‌బాబు పాల్గొన్నారు.

వికారాబాద్: అర్హులైన వారందరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు మంజూర్ చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. నవాబుపేట మడంలంలోని పులుమామిడి, లింగంపల్లి గ్రామాల్లో మంగళవారం అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, ఎంఈవో అబ్దుల్ రహెమాన్, ఏపీవో లక్ష్మీదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తాండూరు/తాండూరు రూరల్/బషీరాబాద్: తాండూరు పట్టణంలోని 1 నుంచి 8వార్డులు, 24, 25 వార్డుల్లో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి ప్రభుత్వం శ్రీకారం చుడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ విక్రం సింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్‌లు బి. రమేష్ పాల్గొన్నారు. మండలంలోని 11గ్రామాల్లో మొదటి రోజు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతంగా కొనసాగాయి. మండలంలోని అల్లాపూర్, బిజ్వార్, చిట్టిఘనాపూర్, గోనూరు, ఎల్మకన్నె, గుంతబాస్పల్లి, కొత్లాపూర్, మల్కాపూర్, పర్వతాపూర్, రాంపూర్‌మీదితండా, వీరొశెట్టిపల్లి గ్రామాల్లో మంగళవారం మొదటి రోజు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి. జాబితాలో పేర్లు రానివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 187, ఇందిరమ్మ ఇళ్ల కోసం 195, రేషన్ కార్డుల కోసం 453, రైతు భరోసా కింద 11, మొత్తం 846 దరఖాస్తులు వచ్చాయని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. వీర్‌శెట్టిపల్లి గ్రామసభలో తాండూరు డిప్యూటీ తహసీల్దార్ సందీప్, ప్రత్యేకాధికారి కొమరయ్యలు వారి పేర్లను గ్రామసభ జాబితాలో చదివి వినిపించగా, కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తల కు సంబంధించిన వారినే అర్హులుగా గుర్తించారని మాజీ సర్పంచ్ బీడే నాగప్ప ఆరోపించారు. అదేవిధంగా బషీరాబాద్ మండలంలోని దామర్‌చెడ్, నవాంద్గీ, కుప్పన్‌కోట్ గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన గ్రామ సభలకు బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ హాజరయ్యారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి జాబితాల్లోని పేర్లను చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లోని సభల్లో పలువురు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు ఇవ్వగా అధికారులు స్వీకరించారు. మైల్వార్, కంసాన్‌పల్లి(బి) గ్రామాల్లోని సభల్లో తహసీల్దార్ వై.వెంకటేష్ పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి మోహన్‌బాబు, ఆర్ఐ నాగార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

కోట్‌పల్లి: బీరోల్, రాంపూర్, అన్నసాగర్, ఇందోల్ గ్రామాల్లో మంగళవారం ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించామన్నారు. నాలుగు గ్రామాలకు గాను రైతు భరోసా 12, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా24, రేషన్ కార్డు నూతన దరఖాస్తులు 115, ఇందిరమ్మ ఇండ్ల కొరకు 51, దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో డానియల్ ఈ సందర్భంగా తెలిపారు.

కొడంగల్ రూరల్: ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్దిదారుల ఎంపికకు మండలంలోని భవనమ్మతాండ, ఇందనూర్, లక్ష్మీపల్లి, నాగారం, పాటిమీదిపల్లి, ఉడిమేశ్వరంలో నేడు (బుధవారం) గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

దుద్యాల: మండలంలోని లగచర్ల, సాగారంతండా, ఎక్కచెరువు తండా, ఈర్లపల్లి, అల్లికాన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. రైతు భరోసాకు 19, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 9, రేషన్ కార్డులకు 216, ఇందిరమ్మ ఇళ్లకు 16 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ తెలిపారు.

యాలాల: ముద్దాయిపేట్, బెన్నూరు గ్రామాలతోపాటు తొమ్మిది గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటికే ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపికైన వారి లిస్టులను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, భీమయ్య, పటేల్‌రెడ్డి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: చౌదర్‌పల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు. మదన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్ దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు.

దౌల్తాబాద్: నాగసార్‌లో తహసీల్దార్ గాయత్రి గ్రామసభ నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు లబ్దిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

చౌడాపూర్: బుర్ర హెమ్యానాయక్, గోగ్యనాయక్ తండాల్లో గ్రామ సభలు నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ ప్రభు మాట్లాడుతూ పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్లలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. ఈనెల 26 నుంచి నాలుగు హామీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మొగులయ్య, మహిపాల్‌రెడ్డి, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు రాములు యాదవ్, నాగేశ్, గణేశ్, శివ తదితరులు పాల్గొన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు.

బంట్వారం: ప్రజాపాలన గ్రామసభల్లో మండలంలోని యాచారంలో 22, సుల్తాన్‌పూర్ 34, మాలసోమారంలో 108 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

అధికారులను నిలదీసిన ప్రజలు

చౌడాపూర్: కొత్తపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా జరిగింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితా దేని ప్రాతిపదికన తయారు చేశారని ప్రజలు అధికారులను నిలదీశారు. ఇందుకు అధికారులు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. అర్హత ఉన్నా తమ పేర్లు జాబితాలో లేవని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బద్రీనాయక్, పంచాయతీ కార్యదర్శి బుచ్చయ్య పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: ఎరన్‌పల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో మంగళవారం ప్రత్యేకాధికారి జైపాల్ పాల్గొన్నారు. అర్హుల పేర్లను గ్రామసభలో చదివి వినిపించారు. ఆత్మీయ భరోసా పథకం కింద ఉపాధి హామీపథకంలో 2023- 2024 సంవత్సరంలో 20రోజులు పని చేసిఉండి భూమిలేని నిరుపేదలు 90మంది ఉన్నారని అధికారులు చదివి వినిపిస్తే 50 మంది వరకు భూమి ఉన్నావారే ఉన్నారని గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే లిస్టులో పేరు రాలేదని చాలా మంది గ్రామసభలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. రేషన్ కార్డులు రాలేదని మరికొందరు అధికారుల దృష్టికి తీసుక వచ్చారు.

తొలిరోజు ప్రశాంతం

మేడ్చల్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన సదస్సులు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను వెల్లడించారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలో నిర్వహించిన సదస్సుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక, కమిషనర్ నాగిరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు పాల్గొనగా, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో నిర్వహించిన సదసుల్లో కమిషనర్ స్వామినాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో తహసీల్దార్ శైలజ, ఏఓ అర్చన, ఎంపీడీవో పాల్గొన్నారు.

కీసర రూరల్: వార్డు సభలను వినియోగించుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 1 నుంచి ఆరు వార్డుల్లో సోమవారం ప్రజాపాలన వార్డుసభలను నిర్వహించారు. ఇంటింటి సర్వే నిర్వహణలో భాగంగా గుర్తించిన సొంతిల్లు లేని, రేషన్‌కార్డు లేని వారి పేర్ల జాబితాను అధికారులు చదివి వినిపించారు. అదేవిధంగా నూతనంగా దరఖాస్తులను స్వీకరించారు. నాలుగో వార్డు ఆర్ఎల్‌నగర్‌లో నిర్వహించిన వార్డు సభలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్త పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలలో వార్డు సభలు జరిగాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన వార్డు సభల్లో మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని పాల్గొని మాట్లాడుతూ జాబితాలో పేరు లేకపోయినప్పటికీ తిరిగి దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొండాపూర్‌లో జరిగిన వార్డుసభలో అలాగే పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ వార్డు సభలో పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రధాన్యత కల్పించారని ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్లు చంద్రశేఖర్, వీరారెడ్డి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: మాదారం, అంకుశాపూర్, మర్రిపల్లి గూడ గ్రామాల్లో మంగళవారం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డులపై ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాల్లో మల్కాజ్‌గిరి అదనపు డీసీపీ వెంకటరమణ ఏసీపీ చక్రపాణి, ఎంపీడీవో గీతారెడ్డి, డిప్యూటీ తహసీల్దారు రాజేందర్, ఎవో బాసిత్ పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లిలో ప్రజాపాలన సభ


ఘట్‌కేసర్: మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పావని

వైభవంగా మల్లికార్జున స్వామి జాతర


జాతరలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మూడుచింతలపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరం గ్రామ పరిధిలో ఉన్న శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యమానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అనిత, మాజీ ఎంపీపీ హారికమురళీగౌడ్, మాజీ సర్పంచ్ జ్యోతి బలరామ్‌గౌడ్, మండల అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు


ఎంపీ ఈటలతో గుండ్లపోచంపల్లి బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ ముదిరాజ్ మంగళవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు హంస రాణి కృష్ణగౌడ్, అమరం సరస్వతి, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతర కృషి


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం రూ.1.66కోట్ల మున్సిపాలిటీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 1వ వార్డులోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో రూ.20లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు మహేష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్ టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 21వ, వార్డులో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ కృష్ణవేణి రవీందర్ గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు జెశైలజ హరినాథ్, నాయకులు నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను గౌరవించే సంస్కృతి మనది

తాండూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గురువులను గౌరవించే సంస్కృతి మనదని ప్రేరణాత్మక వక్త హనుమంత్‌రెడ్డి అన్నారు. తాండూరులో మంగళవారం రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ యువజన దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంచారు. తల్లిద్రండులు గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని, ఉన్నత విలువలతో మెలగాలని కోరారు. యువత స్వామి వివేకానందుడు, అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు బాలకృష్ణ, ఆత్మీయ అతిథి కల్వ రవికుమార్, గౌరవ అధ్యక్షుడు బస్వరాజ్, ప్రోగ్రాం కన్వీనర్ కేవీఎం వెంకట్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జనార్ధన్, పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న వక్త హనుమంత్‌రెడ్డి

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి


బొంరాస్‌పేట్: సమావేశంలో ఐవీ సుబ్బారావు

బొంరాస్‌పేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని స్టేట్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఐవీ. సుబారావు సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కొనసాగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు ఎలా ఉన్నాయని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, ట్రైనింగ్ రీసోర్స్ పర్సన్‌లు జీవన్‌కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

చౌడాపూర్: మండలంలోని మరికల్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో రాంచందర్ మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఆంగ్ల బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్వమంగళం, సీఆర్‌పీలు విజయ్‌కుమార్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.


చౌడాపూర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రాంచందర్

'మహా ప్రదర్శన'ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల నాయకులు

కొడంగల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'వేయి గొంతులు, లక్ష డప్పులు' మహాప్రదర్శన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్, సీనియర్ నాయకులు సోమశేఖర్, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్‌బాబు పిలుపుఇచ్చారు. స్థానిక రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు దస్తప్ప, పకీరప్ప, దాము, బసప్ప, డాక్టర్ వెంకటేశ్వర్లు, మాసాని వెంకటయ్య పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు భూమిపూజ

బొంరాస్‌పేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలంలోని ఊరెన్కి తండాకు బీటీ రోడ్డు మంజూరైంది. రూ.1 కోటి 25 లక్షలు మంజూర్ కావడంతో మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తదితరులు బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, మల్లికార్జున్, దేశ్యనాయక్, నర్సింహులునాయుడు, మల్లేశ్ పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం

(ఐదో పేజీ తరువాయి)

పరిగి, తాండూరు, చేవెళ్ల ఎమ్మెల్యేలు, అదనపు కలెక్టర్లు హాజరయ్యారు. నవాబ్‌పేట మండలంలో నిర్వహించిన గ్రామ సభకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరు కాగా, పూడూరు మండల కేంద్రంలో, దోమ మండలం, శివారెడ్డిపల్లిలో నిర్వహించిన గ్రామ సభలకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. పెద్దేముల్ మండలంలో నిర్వహించిన గాజీపూర్, పెద్దేముల్, గోపాల్‌పూర్, నాగులపల్లి గ్రామాల్లో జరిగిన సభలకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. మోమిన్‌పేట మండలం, మేకవనంపల్లి, ధారూరు మండలం, దోర్నాల్‌లో జరిగిన గ్రామ సభలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, కొడంగల్‌లో నిర్వహించిన వార్డు సభకు రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హాజరయ్యారు.

దరఖాస్తుల స్వీకరణ

ఇదిలా ఉంటే, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డు పథకాలకు ఎంపిక కాని అర్హుల నుంచి గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. నాలుగు పథకాలకు ఎంపిక చేసిన వారి జాబితాలో అర్హులు లేకపోతే దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో తొలిరోజు భారీగానే దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ, వార్డు సభల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో ప్రజలు తమకు వర్తించాల్సిన పథకాల కోసం నిర్ణీత ఫారంలో తమ దరఖాస్తులు అందజేశారు.

క్రైం కార్నర్

ఫోన్‌ట్యాపింగ్‌పై జూబ్లీహిల్స్ పోలీసుల విచారణ

తాండూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల ముందు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళి కృష్ణగౌడ్ కు సంబంధించిన సెల్‌ఫోన్‌ను ట్రాప్ చేశారని జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం విచారణ జరిపారు. అప్పట్లో ప్రభుత్వానికి సంబంధించి కొంత మంది అధికారులు బీఆర్‌ఎస్‌లో ఉంటూ పార్టీ మారిన కొంత మంది ముఖ్యమైన వ్యక్తుల ఫోన్‌ట్యాపింగ్ చేశారని, పోలీసులకు నివేదిక అందింది. ఈ నివేదిక ఆధారంగా గతంలో తాండూరు సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్‌ను పోలీసులు విచారించారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళి గౌడ్‌ను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి రెండు గంటల పాటు విచారించారు. అయితే తన ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని అనుమానంతోనే ముందుగానే తాను పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినప్పటికి పట్టించుకోలేదని, ఈ విషయంలో నిజనిజాలు తేలాలని తన ఫోన్ ఎవరు ట్యాపింగ్ చేశారో తేల్చే వరకు పోలీసులకు సహకరిస్తానని మురళి కృష్ణ గౌడ్ చెప్పారు.

ఫిట్స్‌తో యువ రైతు మృతి


అనిల్(ఫైల్)

తాండూరు రూరల్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): పొలం చదును చేస్తుండగా ఓ యువ రైతు ఫిట్స్ రావడంతో మృతి చెందాడు. ఈ ఘటన తాండూరు మండలం చెంగోల్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సాతమొల్ల అనిల్(28)కు రెండు కరాల భూమి ఉంది. అట్టి భూమిలో వరిపంట వేసుకునేందుకు అనిల్ భూమిచదును చేస్తున్నాడు. ఈ క్రమంలో అనిల్‌కు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో బురదలో కూరుకుపోయాడు. పొలం వద్ద ఎవరూ లేకపోవడంతో అనిల్‌ను ఎవరూ గుర్తించలేదు. కుటుంబ సభ్యులు పొలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న అనిల్‌ను తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రైతు మృతిచెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతుడికి భార్య భారతి, కూతురు, కుమారుడు ఉన్నారు. అనిల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బాల్యవివాహం చేయొద్దని కౌన్సెలింగ్

ధారూరు, జనవరి21(ఆంధ్రజ్యోతి): మైనర్‌కు వివాహం చేసేందుకు ప్రయత్నిస్తున్న కుటుంబసభ్యులకు చైల్డ్‌లైన్, పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఓగ్రామానికి చెందిన మైనర్(17) వికారాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే బాలిక సంక్రాంతి సెలవులకు కాలేజీ నుంచి ఇంటికి రావటంతో తల్లిదండ్రులు పెళ్లిచేయాలని నిర్ణయించారు. ఈ విషయం 1098 చైల్డ్‌లైన్‌కు ఫోన్‌కాల్ సమాచారం రావటంతో మంగళవారం వారు ఐసీడీఎస్, పోలీసు సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 18సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలని నచ్చజెప్పారు. అనంతరం బాలికను వికారాబాద్ సఖీ కేంద్రానికి తరలించారు.

కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్న ఇద్దరిపై కేసు

ధారూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన గ్రామ సభలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌పై చేయిచేసుకుని నెట్టివేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రాందాస్‌ను మైలారం ముందలి తండాకు చెందిన అంగోత్ బద్య నాయక్, రమావత్ శ్రీనివాస్‌లు మద్యంమత్తులో చేయిచేసుకుని నెట్టివేశారు. కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగా ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.